క్లుప్తంగా

కొవ్వలిలో ఉపవాస ప్రార్థన కూడిక



కొవ్వలిలో బేతేలు సువార్త ప్రార్థనా మందిరంలో వాఖ్య పరిచయం చేస్తున్న సువార్తీకులు

దెందులూరు: దేవునితో మాట్లాడటమే ప్రార్థన అని, దేవుడిని నమ్మి కొలిచిన విశ్వాసులకు సమస్తం సాధ్యపడుతుందని సువార్తీకులు అన్నారు. కొవ్వలి బేతేలు సువార్త మందిరంలో 6 రోజులు పాటు కొనసాగనున్న ఉపవాస కూడిక ప్రార్థనలు మంగళవారం ప్రారంభమయ్యాయి. విశ్వాస కూడికలకు ఏలూరు, దెందులూరు, భీమడోలు, పెదవేగి మండలాల నుంచి విశ్వాసులు పాల్గొన్నారు.

పిప్పర హైస్కూలుకు రూ.లక్ష విరాళం



రూ.లక్ష చెక్కు అందజేస్తున్న ఇందుకూరి

గణపవరం: పిప్పర జెడ్పీ హైస్కూలు అభివృద్ధి కోసం మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ ఇందుకూరి రామకృష్ణంరాజు లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. మంగళవారం దీనికి సంబంధించిన చెక్కును హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు పీజే వెంకటేశ్వర్లుకు అందించారు. తన స్వగ్రామం పిప్పరలోని హైస్కూలును తన తండ్రి పేరున నిర్మించామని, ఈ హైస్కూలు అభివృద్ధిలో తనవంతు పాత్ర పోషిస్తున్నానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

ఉంగుటూరు ఎంపీడీవోగా జి.రాజ్‌మనోజ్



ఉంగుటూరు ఎంపీడీవో రాజ్‌మనోజ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి

ఉంగుటూరు: ఉంగుటూరు ఎంపీడీవోగా జి.రాజ్‌మనోజ్ మంగళవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి పుష్పగుచ్ఛం అందించి స్వాగతించారు. రాజ్‌మనోజ్ పెదవేగి నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇంతకు ముందు పెదపాడు, కుకునూరు తదితర మండలాల్లో ఆయన పనిచేశారు. రెండేళ్లగా ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో ప్రేమాన్విత యలమంచిలి ఎంపీడీవోగా బదిలీ అయ్యారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందుకున్న విద్యార్థులు

ఉంగుటూరు: మెట్ల పార్వతి మెమోరియల్ ట్రస్టు సేవలు అభినందనీయమైనవని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం కాగుపాడు జిల్లాపరిషత్ హైస్కూల్లో మెట్ల పార్వతి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు, ఇతర విభాగాల్లో ప్రతిభచూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న సర్పంచి కడియాల సుధీష్ణ మాటాడుతూ ట్రస్టు సేవలను అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు టి.వెంకన్న బాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో స్థానిక యూనియన్ బ్యాంకు మేనేజరు బి.సంతోష్‌కుమార్, పత్తి వీరాస్వామి, పెట్ల కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ జాతర

దెందులూరు: శ్రీరామవరంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా గంగానమ్మ జాతర నిర్వహించారు. నాయకులు మోత్కూరి నాని ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, నైవేద్యాలు సమర్పించారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మండల అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లుబాబు), క్లస్టర్ ఇన్‌ఛార్జి గారపాటి కొండయ్యచౌదరి, ప్రజాప్రతినిధులు పూజలు నిర్వహించారు.

నేటి నుంచి బాణసంచా షాపులకు లైసెన్సులు

దెందులూరు: దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా సామగ్రి విక్రయదారులకు తాత్కాలిక లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకునేవారు బుధవారం నుంచి వచ్చే నెల 15వ తేదీలోపు ఏలూరు ఆర్డీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని దెందులూరు తహసీల్దార్ బి.సుమతి అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ దరఖాస్తుతో పాటు దరఖాస్తుదారుని ఆధార్, పాన్‌కార్డు, చలానా, జీఎస్‌టీ చెల్లించి రశీదును దరఖాస్తుకు జతపరచాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి లైసెన్సులిస్తామన్నారు.

రైతులకు అందని పెట్టుబడి రాయితీ

- ప్రకటనకే పరిమితం.. నిధుల విడుదలలో జాప్యం
- పంట నష్టంతో పాటు బీమా అందించాలని సాగుదారుల డిమాండ్
- కూటమి ప్రభుత్వ తీరుపై అన్నదాతల అసహనం



ఇటీవల అధిక వర్షాలకు దెబ్బతిన్న వరి పంట

పెదపాడు: ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతినడంతో ప్రభుత్వం పెట్టుబడి రాయితీని ప్రకటించినా అది ఇంకా రైతులకు చేరువ కాలేదు. హెక్టారుకు రూ.25వేల పెట్టుబడి రాయితీని ప్రకటించడంతో రైతులు తమకు నష్టపరిహారంతో పాటు పంటల బీమా కూడా అందించాలని కోరుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెదపా డు, దెందులూరు, ఏలూరు మండలాల పరిధిలో సుమారు 2వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్టు అధికారులు అధికారులు ధ్రువీకరించారు.దీంతో ప్రభుత్వం ఎకరాకు రూ.10వేల ఇన్‌పుట్ సబ్సిడీని ప్రకటించి నిధులను విడదల చేయడంలో జాప్యం చేస్తోంది.దీంతో కూటమి ప్రభుత్వ తీరుపై అన్నదాతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఎకరాకు రూ.25వేల వరకు ఖర్చు

వరి పంటకు ఎకరాకు రూ.25వేల వరకు ఖర్చు చేసినట్లు రైతులు వాపోతున్నారు. ఎకరాకు దుక్కి చేయడం, చేలను బాగు చేయడం, వరినారు మడులు, నాట్లు వేయడం, ఎరువులు చల్లడం వంటి పనులకు సుమారు రూ.20 నుంచి రూ.25వేల వరకు

వరదల వల్ల ఏర్పడిన పంట నష్టం

మండలం	ఎకరాలు
పెదపాడు	863
ఏలూరు	410
దెందులూరు	1,180

ఖర్చు అయ్యిందని నష్టపరిహారంతో పాటు పంటల బీమా కూడా అందించాలని రైతులు కోరుతున్నారు. వరదల కారణంగా పంటను కోల్పోయిన రైతులు దాళ్వా విత్తనాలను వెదచల్లుదామనుకున్నా ఆ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయదని అధికారులు అంటున్నారని రైతులు వాపోతున్నారు.



వరద బారిన పడి దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

దీనివల్ల అన్నదాత పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైందని పలువురు వాపోతున్నారు.

కౌలు రైతులకు పంటల బీమా వర్తింపజేయాలి



పెట్టుబడి రాయితీని రూ.10 వేలు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించినా రైతులకు అవి అందలేదు. ప్రధాన మంత్రి పంటల బీమా యోజన పథకంలో పంట ఏ దశలో ఉన్నా పరిహారం వారంలోగా పరిహారం ఇవ్వాలి. ఆ విధంగా అమలు చేయడం లేదు. కౌలు రైతులకు బీమా వర్తింప చేయడంలేదు. ప్రభుత్వం ప్రకటనలకు అమలుకు పొంతన ఉండటంలేదు.

– కె.శ్రీనివాస్, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి

ప్రభుత్వం ప్రకటనకే పరిమితమవుతూ నిధుల విడుదలలో జాప్యం చేస్తోందని, ఇలా అయితే సాగుకు అప్పులు చేయాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

పంటల బీమా అందించాలి

పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారంతో పాటు పంటల బీమా అందిస్తే ఆర్థికంగా ఆదుకున్నవారు అవుతారని రైతులు కోరుతున్నారు. పంటల బీమా వర్తింపజేయాలని రైతులు కోరుతున్నారు. మండలం, గ్రామం యూనిట్‌గా కాకుండా సర్వే నంబర్లు యూనిట్‌గా తీసుకుని పంటల బీమా వర్తింపజేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

విద్యాప్రమాణాలను మెరుగుపర్చాలి



గుండుగొలనులో చిన్నారులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈవో అయినపర్తి భాస్కర్‌కుమార్

భీమడోలు: విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని భీమడోలు ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్ అన్నారు. గుండుగొలనులోని ప్రాథమిక పాఠశాలలను ఆయన మంగళవారం ఆకస్మిక తనిఖీ చేసారు. విద్యా కార్యక్రమాల అమలు తీరు, ఎండీఎం నిర్వహణ, స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలపై ఆయన తనిఖీలు చేశారు. గుండుగొలను-1 పాఠశాలలో విద్యా బోధన అమలు తీరును ఆయన పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలపై పలు ప్రశ్నలు అడిగి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. సిలబస్ మేరకు పాఠ్యాంశాలు పూర్తి చేసిందీ లేనిదీ పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలందించారు. పాఠశాలల్లో నాణ్యమైన భోజనం, మంచినీరు, పరిశుభ్రత పాటించాలని విద్యార్థులకు సూచించారు. భీమడోలు- 2 పాఠశాలలో చిన్నారులతో కూర్చుని సహపంక్తి భోజనం చేశారు. పాఠశాలల్లో రాగిజావను చిన్నారులకు అందించి రాగి జావ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. హెచ్‌ఎం పాశం పాండురంగారావు, సీఆర్‌పీ రమణ, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిల్లు మంజూరు కోరుతూ ఫొటోగ్రాఫర్ల ధర్నా

దెందులూరు: ఆరు నెలలు గడిచినా ఎలక్షన్ పెండింగ్ బిల్లులు ఇవ్వలేదని, 2024 అసెంబ్లీ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఫొటోగ్రాఫర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వహించామని ఒక్కొక్క ఫొటోగ్రాఫర్‌కి రూ.60 వేలకుపైగా గౌరవ వేతనం రావాలని దెందులూరు మండలంలో విధులు నిర్వహించిన వారందరికీ రూ.7 లక్షలకుపైగా బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. 5 నెలలుగా తహసీల్దార్, ఆర్డీఓ దగ్గర నుంచి కలెక్టర్లను ఎన్నిసార్లు కలిసి విన్నవించినా తమకు ఎటువంటి పరిష్కారం దొరకలేదన్నారు.ఫ్లెక్సీలు, ప్లకార్డులు పట్టుకుని పోలీస్‌స్టేషన్, ఎంపీడీఓ కార్యాలయం మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.



దెందులూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఫొటోగ్రాఫర్లు

అనంతరం తహసీల్దార్ బి.సుమతికి వినతిపత్రం అందజేశారు. ఫొటోగ్రాఫర్లకు బిల్లు మంజూరైన వెంటనే చెల్లిస్తామని తహసీల్దార్ సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్.దుర్గారావు, కె.రాంబాబు, వై.రాజారత్నం, జె.సునీల్, ఎన్.మల్లేశ్వరరావు, టి.కిషోర్, బాలు, కె.సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలి



కషాయ ద్రావణం తయారీని పరిశీలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి



నాచుగుంట పొలంబాటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

భీమడోలు: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి అన్నారు. సార్వా సీజన్‌లో రైతులు తమకు నచ్చిన రైస్‌మిల్లుకు ధాన్యాన్ని తరలించునేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు. సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరులో మంగళవారం పొలంబడి కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. సార్వా పంట చేలను పరిశీలించారు. పంటకు ఎండాకు తెగులు సోకిందని రైతులు జేసీ దృష్టికి తీసుకువెళ్లారు. నివారణ చర్యలపై ఆమె సంబంధిత వ్యవసాయ శాఖ అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తెగుళ్ల నిర్మూలనకు వాడే కషాయం తయారీని, ఆర్‌బీకేలోని తేమశాతం యంత్రం పనితీరును ఆమె పరిశీలించారు. రైతులతో ముచ్చటిస్తూ పలు అంశాలపై చర్చించారు. పాతూరు వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన రైతు సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేసీ హాజరయ్యారు. సివిల్ సప్‌లైయీస్, పశుసంవర్థక, మత్స్యశాఖ, సేంద్రియ వ్యవసాయం తదితర శాఖల అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం జేసీ మాట్లాడుతూ అక్టోబర్ 7వ తేదీ నుంచి అన్ని మండలాల్లో ఖరీఫ్ ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నిర్దేశించిన క్యాలెండర్ ప్రకారం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ప్రతి రైతు ధాన్యంలో తేమ శాతం 17 శాతం లోపు ఉండేలా ఆరబెట్టుకోవాలన్నారు. ఏ రైస్ మిల్లుకు తమ ధాన్యం పంపాలనుకుంటున్నారో రైతు సదస్సుల్లో తీర్మానం చేసి ఉన్నతాధికారులకు అందజేయాలన్నారు. మండల స్టాక్ పాయింట్లకు వచ్చే గోనె సంచుల నాణ్యతను రైతులు పరిశీలించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో సత్యనారాయణరాజు, ఏడీఏ పి.ఉషారాజకుమారి, తహసీల్దార్ బి.ఉమాదేవి, ఏవో ఉషారాణి, రైతులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పొలం బాట

ఉంగుటూరు: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా తూటికాడ కషాయం తయారీ విధానం, వినియోగం, వాటి ఉపయోగాలను ఏవో డాక్టర్ ఎన్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పొలంబాట కార్యక్రమం నాచుగుంట, ఉంగుటూరులో నిర్వహించారు. ధాన్యం కొనుగోలు విధానాన్ని తహసీల్దార్ బొడ్డేపల్లి ప్రసాదు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుసంర్థక శాఖ, డాక్టర్ శిరీష్, విద్యుత్ ఏఈ శ్రీరామ్ ఆ శాఖాపరమైన అంశాలు తెలిపారు. ఉంగుటూరు సర్పంచి బండారు సింధు, నాచుగుంట సర్పంచి ఏలేటి సునీత, ఎంపీటీసీ సభ్యురాలు గంటా ఉషారాణి పాల్గొన్నారు.

సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యం

పెదపాడు: సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యం పొందవచ్చని పెదపాడు మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ తెలిపారు. కలపర్రు, వట్లూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు సేంద్రియ సాగు చేపట్టాలన్నారు. వ్యవసాయ అధికారి ప్రదీప్ కుమార్, పశుసంవర్థక శాఖ అధికారి కిరణ్, మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ నాగరాజు పాల్గొన్నారు.

రెండవ పంట మార్పిడితో అధిక దిగుబడి

పెదవేగి : రెండవ పంట మార్పిడితో రైతులు పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చని పెదవేగి వ్యవసాయ అధికారి ఎం ప్రియాంక అన్నారు. మంగళవారం పెదవేగి మండలంలోని కె కన్నాపురం, తాళ్లగోకవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పొలాలను పరిశీలించిన ఏవో మాట్లాడుతూ రైతులతో మొక్కల సాంద్రత పాటించడం రైతులకు ప్రథమం అన్నారు. మందులు కూడా సరైన సమయంలో వేయాలన్నారు. ఈ కార్యాక్రమంలో వీపీఏలు, రైతులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు వరం 'ఎన్ఎంఎంఎస్'

దెందులూరు: ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని దెందులూరు ఎంఈఓ ఏవీఎస్‌వీ ప్రసాద్ మంగళవారం పేర్కొన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, పురపాలక, ఎయిడెడ్, మండల పరిషత్, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే అర్హత పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు నెలకు రూ.1000 చొప్పున ఏడాదికి రూ.12 వేలు ఉపకార వేతనం అందిస్తారన్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు నాలుగేళ్ల పాటు ఈ స్కాలర్‌షిప్



ఏవీఎస్‌వీ ప్రసాద్, దెందులూరు ఎంఈఓ

అందుతుందని చెప్పారు. దరఖాస్తు చేసుకోవడానికి ఓసీ, బీసీ విద్యార్థులైతే పరీక్షల రుసుము రూ.100 చెల్లించాలని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు పరీక్ష రుసుము రూ.50 చెల్లించాలన్నారు. పరీక్షా రుసుమును ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇచ్చిన ఎస్‌బీఐ కలెక్ట్ లింకు ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉందన్నారు. దరఖాస్తులను ప్రభుత్వ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఐఎన్ నందు నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసే సమయంలో ఆధార్‌కార్డులో ఉన్న విధంగానే విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేర్లను నమోదు చేయాలన్నారు.

ఆర్టీఐ చట్టాన్ని వినియోగించుకోవాలి

దెందులూరు: ప్రభుత్వపరంగా జరిగే ప్రతి పథకం, అభివృద్ధిని, కావాల్సిన సమాచారాన్ని తెలుసుకునే హక్కు ప్రతి పౌరుడికీ ఉందని ఫొరెన్ ఫర్ గుడ్ గవర్నెన్స్ జాతీయ అధ్యక్షుడు కమ్మ శివరామకృష్ణ అన్నారు. మంగళవారం దెందులూరు నర్సింగ్ కళాశాలలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 12 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ముఖ్యంగా గ్రామ, శివారు, గిరిజన ప్రాంతాల్లో సమాచారహక్కు చట్టంపై సదస్సులు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. వారం రోజుల పాటు నిర్వహించనున్న ఈ వారోత్సవాల్లో ప్రజలకు పౌరహక్కులపై అవగాహన కల్పించడం వారోత్సవాల్లో ముఖ్య లక్ష్యమన్నారు. స్వచ్ఛంద సంస్థలు, రిటైర్డ్ ఉద్యోగులు, మేధావులు, ఉపాధ్యాయులు, యువత, ప్రతి ఒక్కరికీ సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంపొందించడానికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు ఉన్నారు.



దెందులూరులో మాట్లాడుతున్న కమ్మ శివరామకృష్ణ, సుగ్గిశెట్టి నూకరాజు

డాక్టర్ల సమస్యలు పరిష్కరించాలి

దెందులూరు: పీహెచ్‌సీ డాక్టర్ల భవిష్యత్తును కాపాడేందుకు, హక్కులను సాధించుకునేందుకు పీహెచ్‌సీ డాక్టర్ల రాష్ట్ర యూనియన్ ఆదేశాలను అమలు చేస్తామని ఆ సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి డాక్టర్ పూర్ణచంద్రరావు మంగళవారం అన్నారు. యూనియన్ పిలుపు మేరకు భవిష్యత్ ప్రణాళిక చర్చిలో భాగంగా విజయవాడలో నిర్వహించనున్న సమావేశానికి పోతునూరు, గోపన్నపాలెం, దెందులూరు ప్రభుత్వ వైద్యులు వెళ్లారు. ఒకవైపు వైద్యశాలల్లో సాధారణ, అత్యవసర వైద్యం నిలిచినా, మరోవైపు పీహెచ్‌సీ డాక్టర్ల భవిష్యత్తుకు ఆటంకంగా ఉన్న జీవో కోసం వారం రోజులుగా డాక్టర్లు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. డాక్టర్ల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. దెందులూరు మండలం పోతునూరు, గోపన్నపాలెం, దెందులూరు వైద్యశాలల నుంచి డాక్టర్లు ప్రవీణ్, చైతన్య పవన్, నాయక్, రాకేష్, రోజ్‌మేరీ విజయవాడలో డాక్టర్ల వైద్య రాష్ట్ర సమావేశానికి తరలివెళ్లారు.



రాష్ట్ర యూనియన్ పీహెచ్‌సీ డాక్టర్ల సమావేశంలో దెందులూరు, పోతునూరు, గోపన్నపాలెం సిబ్బంది

రైతులు ఆధునిక సాంకేతికతను అనుసరించాలి

గణపవరం: రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించాలని ఎమ్మెల్యే పి.ధర్మరాజు అన్నారు. మంగళవారం గణపవరం మండలం చిలకంపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. తాడేపల్లిగూడెం ఏడీఏ పి.మురళీకృష్ణ మాట్లాడుతూ రైతులకు నమో డ్రోన్ దీదీ పథకాన్ని వివరించారు. డ్రోన్‌లు ఉపయోగించడం ద్వారా రైతులు సమయం, డబ్బు ఆదా చేసుకోవచ్చునన్నారు. మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో 11,600 ఎకరాల్లో సార్వాసాగు చేస్తున్నట్లు తెలిపారు. 98 శాతం పంట నమోదు పూర్తయిందన్నారు. సర్పంచ్ చుక్కా అప్పారావు, ఎంపీటీసీ పి.వెంకటనారాయణ, మత్స్యశాఖ అధికారి శివరామకృష్ణ, వెటర్నరీ డాక్టర్ జ్యోతి, వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎ.ఆనంద్, జె.దయాల్ పాల్గొన్నారు.



చిలకంపాడులో డ్రోన్‌తో రసాయనాల పిచికారీని వివరిస్తున్న వ్యవసాయ అధికారులు

చిన్నారుల విరాళాల సేకరణ



విజయవాడ వరద బాధితులకు విరాళాలు సేకరించిన చిన్నారులు

గణపవరం: ఇటీవల బుడమేరు కారణంగా విజయవాడ ప్రజలకు జరిగిన నష్టాన్ని చూసిన చిన్నారులు వారిని ఆదుకునేందుకు స్పందంచి ఉపాధ్యాయుల సహకారంతో విరాళాలు సేకరించారు. గణపవరం మండలం ముప్పర్తిపాడు యూపీ పాఠశాలలో చదువుతున్న ఆ చిన్నారులు రెండు రోజులపాటు గ్రామంలో గడపగడపకూ వెళ్లి వరదల సహాయం కోసం అర్థించారు. గ్రామస్తులంతా తలా కొంత మొత్తాన్ని ఆ చిన్నారులకు అందించారు. ఆ చిన్నారులంతా కలిసి రూ.25 వేలు విరాళాలుగా సేకరించి, విజయవాడలోని వరద బాధితులకు పంపించాల్సిందిగా ప్రధానోపాధ్యాయునికి అందజేశారు.

ఎస్సీ, ఎస్టీ మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు



పెదపాడులో మాట్లాడుతున్న కమ్యూనిటీ కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు

పెదపాడు: మహిళల కోసం ఎన్ని చట్టాలున్నా ఏదో ఒకచోట దాడులు జరుగుతూనే ఉన్నాయని డీఆర్‌డీఏ డ్వాక్రా కమ్యూనిటీ కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో దళిత బహుజన రిసోర్స్‌సెంట్ ఆధ్వర్యంలో ఎస్సీ ఎస్టీ మహిళలకు మహిళా రక్షణ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ డ్వాక్రా కమ్యూనిటీ కో ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు చట్టాల గురించి అవగాహన ఏర్పరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా సీసీలు పాల్గొన్నారు.

విద్యార్థులు సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

గణపవరం: విద్యార్థులు చదువుతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములై సమాజంపై అవగాహన కలిగి ఉండాలని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. మంగళవారం గణపవరంలోని చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) దినోత్సవ వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థి దశలో సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా నాయకత్వ లక్షణాలు అలవడటంతోపాటు సమాజం పట్ల బాధ్యత కలుగుతుందని, దీనికి ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో రెండు ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఉన్నాయన్నారు. ఒక్కో యూనిట్‌లో 100 మంది విద్యార్థుల చొప్పున మొత్తం 200 మంది వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, షీల్డులు అందజేశారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి జి.వెంకటరమణ మాట్లాడుతూ వలంటీర్లకు జాతీయ, రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీ పరీక్షల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, ఐక్యుఏసీ కోఆర్డినేటర్ సీహెచ్ చైతన్య, టి.అక్కిరాజు, కేవీ గణేష్‌కుమార్ ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



డిగ్రీ కాలేజిలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపల్

విద్యార్థుల రక్తదానం

ఉంగుటూరు: జాతీయ సేవా పథకం దినోత్సవం సందర్భంగా నారాయణపురం ఎస్ఏఎస్ ప్రభుత్వ కళాశాలలో మంగళవారం రక్తదానం నిర్వహించారు. వంగాయగూడెం గుడ్ సమరిటన్ క్యాన్సర్ ఆసుపత్రి బ్లడ్ సెంటరు సహకారంతో రక్తదానం శిబిరం నిర్వహించారు. కళాశాలకు చెందిన 14 మంది విద్యార్థులతో పాటు పలువురు రక్తదానం చేశారు. ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు విద్యార్థులను అభినందించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ పలిపాటి రాజు, హెల్త్ ఆఫీసరు డాక్టర్ రాజేంద్ర పాల్గొన్నారు. స్థానిక మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో బాల్యవివాహాల రహిత భారతదేశం కోసం అందరూ కృషి చేయాలని కోరుతూ విద్యార్థులతో సోషల్ వర్కర్ చెమటపల్లి రేఖ ప్రమాణం చేయించారు. చైల్డ్ హక్కుల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ బీవీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న దృశ్యం

వర్షంతో సాగుకు జీవం

పెదవేగి : తుఫాను ప్రభావంతో కొద్ది రోజుల నుంచి కురిసిన వర్షానికి అన్నదాతల మోములో చిరునవ్వు వెల్లివిరిసింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలకు జీవం వచ్చింది. పెదవేగి మండలంలో వర్షాలు మరిన్ని రోజులు కొనసాగితే చెరువులు నిండి కనీసం రెండో పంటకైనా సాగునీరు అందుతుందని రైతులు చెబుతున్నారు. వ్యవసాయాధికారుల లెక్కల ప్రకారం ఆగస్టు నెలాఖరునాటికి ఖరీఫ్‌కాలం ముగుస్తుంది. ఖరీఫ్ ప్రారంభం నుంచి వర్షాభావ పరిస్థితులు నెలకొనకపోవడంతో రైతులు కొంతమేర నిరాశ చెందగా, అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురిసిన విస్తార వర్షాలకు వ్యవసాయ పనులు మరింత ఊపందుకోవడానికి అవకాశం ఉంటుందని రైతులు భావిస్తున్నారు.

మరో కొన్ని రోజులు కురవాలి

పెదవేగి మండలంలోని 2,475 హెక్టార్లలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం కాగా, దాదాపు పంట మొత్తం పిలకల దశలో ఉందని పొలాలకు నత్రజనితో కూడిన ఈ వర్షం నూతన నిగారింపును తెచ్చిపెడుతుందని వ్యవసాయధికారిణి ఎం ప్రియాంక తెలిపారు. మరి కొన్ని రోజులు వర్షాలు కురిస్తే ఖరీఫ్ పంట గట్టెక్కుతుందని రైతులు చెబుతున్నారు.